
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 6 ఆగస్టు 2025 పేజీలు 8







# అన్నదాతల సంక్షేమమే ప్రాధాన్యం

- పంట సాగుకు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉంచాం
- విచ్చలవిడి ఎరువులు వాడి నేలను నిస్సారం చేసుకోవద్దు
- ఉద్యాన పంటలతో రైతు ఇంట సిరుల పంట
- అగ్రీ టెక్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- స్వయంగా వరి నాట్లు వేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- రైతన్న వెంట మేమంతా ఉన్నామనే భరోసా కల్పించిన కలెక్టర్

**విజయవాడ బ్యూరో, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** అన్నదాతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. రైతుల క్షేమం, సంక్షేమంతోనే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారమవుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఇబ్రహీంపట్నం 2



వాట్సాప్ గవర్నెన్స్‌పై

## అవగాహన కల్పించండి

ఒక్క నెంబర్ (95523 00009) తో 200కు పైగా సేవలు

దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలో..

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ 2

శివారుకు సాగునీటిని అందించేందుకు

# రాత్రింబవళ్లు పని చేస్తా

రాష్ట్ర సాగునీటి శాఖామంత్రి నిమ్మల రామానాయుడు

**గుడ్లవల్లేరు ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో శివారులో ఉన్న చివరి వ్యవసాయ భూములకు సైతం సాగునీటిని అందించేందుకు రాత్రింబవళ్లు పని చేస్తానని రాష్ట్ర సాగునీటి శాఖామంత్రి నిమ్మల రామానాయుడు రైతులకు హామి ఇచ్చారు. గుడ్లవల్లేరులో మంగళవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు సాగునీటిని అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలవరం ● 2లో..

కోడిగుడ్లు పంపిణీలో

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ప్రతి గుడ్డుపై ప్రభుత్వ ఆమోద ముద్ర కలిగి ఉండాలి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా సుల్తానా బేగం



సూర్య ఎఫెక్ట్

**కంచికచర్ల ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** అంగన్వాడి కేంద్రాల్లో కోడిగుడ్లు పంపిణీ నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండాలని లేనిచో చర్యలు తప్పవని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా సుల్తానా బేగం ఘాటుగా స్పందించారు. మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

### శివారుకు సాగునీటిని అందించేందుకు

# రాత్రింబవళ్లు పని చేస్తా

నిర్మాణంతో పాటు లెఫ్ట్ కెనాల్ పనులతో ఉత్తరాంధ్రకు నీటిని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మరొక పక్క రాయలసీమకు గుండెకాయ వంటి హంద్రీనీవా నుంచి ఇటీవల 3,800క్యూసెక్కుల నీటిని సీఎం చంద్రబాబు విడుదల చేశారన్నారు. వెలుగొండ పనులను 2026కల్లా పూర్తి చేసి నీటిని వదలనున్నట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి సాగునీటిని అందించే శ్రీశైలం ప్రాజెక్ట్‌కు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆ ప్రాజెక్ట్‌కు ఇబ్బంది వస్తే...గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో తిండి కూడా కరువవుతుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ రిపేర్లతో పాటు ధవళేశ్వరం ప్రాజెక్టుల రిపేర్లకు నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే రూ.700కోట్ల ఓ అండ్ ఎం నిధులను కేటాయించినట్లు తెలిపారు. కృష్ణా, గోదావరి డెల్టాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గుడ్లవల్లేరు పుల్లేటికి చెందిన లాకులు కూడా రిపేర్లకు గురయ్యాయని చెప్పారు. పులిచింతల, అన్నమయ్య గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. లక్షల క్యూసెక్కుల సాగునీరు సముద్రంలోకి పోతుందన్నారు. థైలాండ్‌లో నీటి ఎద్దడి ఉందన్నారు. రూ.18వేల కోట్ల బిల్లుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. గుడివాడ, పెడన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, ఈడె మోహన్, పాలేటి నాగాంజనేయులు, పరసా పోతురాజు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి




**విజయవాడ, మేజర్ న్యూస్ :** డిజిటల్ సేవలలో భాగంగా అందుబాటులో ఉన్న వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్) పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మిశ అన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వంలో భాగంగా అందుబాటులో ఉన్న వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్) పై సచివాలయ అధికారులు,సిబ్బందితో అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మిశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మంగళవారం బందర్ రోడ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మిశ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ ను తీసుకురావడం జరిగిందని, దీనిలో భాగంగా ఒక్క నెంబర్ తో 26 శాఖలకు చెందిన 200కు పైగా సేవలు ప్రతి పౌరునికి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మనమిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 అవగాహన కల్పించాలన్నారు. మనమిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా నేటి నుండి ప్రతి నెల 5వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఆరోజు సెలవు రోజైతే మరుసటి రోజు నిర్వహిస్తామన్నారు. అవగాహన ర్యాలీలో గ్రామ,వార్డ్ సచివాలయాల విఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీలతోపాటు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లు,వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు కూడా ఈ ర్యాలీలో పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రతినెల నిర్వహించే ర్యాలీలను పర్యవేక్షణ చేస్తారని కలెక్టర్ లక్ష్మీశా అన్నారు. ర్యాలీ డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అవగాహన ర్యాలీలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి. జ్యోతి ఉన్నారు.

## కోడిగుడ్లు పంపిణీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మంగళవారం ఆమె పలు అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి గుడ్డు 50 గ్రాములు ఉండాలని,కోడిగుడ్ల ట్రై 1500 గ్రాములు పైబడి ఉండాలని సూచించారు. ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ ఉంటే సహించేది లేదన్నారు.ట్రై లో ఉన్న గుడ్లు అన్ని ప్రభుత్వ ఆమోదముద్ర కలిగి ఉండాలని లేనిచో శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీ లో కోడిగుడ్ల ట్రై కి 8 నుండి 10 గుడ్ల వరకు ప్రభుత్వ ఆమోదముద్ర లేకుండా ఉండటాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ గమనించారు. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్కు నోటీసులు జారీ చేసి అవసరమైతే అతనికి చెల్లించే సొమ్మును నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు,చిన్న పిల్లలకు అందించే పోషకాహారాలలో, బాలామృతాలలో ఎటువంటి లోపాలు జరిగిన కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు,ఆయాలు,బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# అన్నదాతల సంక్షేమమే ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

మండలం, గుంటుపల్లిలో జరిగింది. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రైతు జి.రవీంద్రనాథ్ ఠాగూర్ పొలంలో వరి నాట్లు వేసి.. రైతులు అన్నివిధాలా ఎదిగేందుకు మేమంతా వారి వెనుక ఉన్నామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ ప్రత్యేక సమస్యలు ఉంటాయని.. ఈ నేపథ్యంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు, సీసీఆర్సీ కార్డులు, పంట రుణాలు.. ఇలా ప్రతి అంశానికి సంబంధించి రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని.. బయోమెట్రిక్ ఆధారిత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే విచ్చలవిడిగా ఎరువులు వినియోగించవద్దని, తెలిసో తెలియకో అలా వినియోగిస్తే నేల నిస్సారమై, సాగుకు పనికిరాకుండా పోతుందన్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందని..అదేవిధంగా ప్రకృతి సేద్య విధానాలను కూడా అనుసరించాలని సూచించారు. గుంటుపల్లిలో ప్రధానంగా బీపీటీ 5204, ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, పీఎల్ 1100 రకాలు పండిస్తున్నారని.. వరికి సంబంధించి మొదటి దఫా యూరియా గుళికలు వేసి తర్వాత రెండు, మూడు విడతల్లో నానో యూరియాకు ప్రాధాన్యమివ్వాలని.. దీనివల్ల దాదాపు 50 శాతం ఎరువు ఆదా అవడమే కాకుండా సామర్థ్యమూ పెరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే 39 వ్యవసాయ డ్రోన్లు అందించామని, ఇక్కడ కూడా అవసరం మేరకు డ్రోన్లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం లక్ష్యంగా హైటెక్ అగ్రికల్చర్, ప్రెసిషన్ అగ్రికల్చర్, మార్కెట్ లింక్డ్ అగ్రికల్చర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. సాగు పరంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ (91549 70454) అందుబాటులో ఉందని.. కాల్ చేసి సమాచారమిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు.



ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా సంబంధీకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

**ఉద్యాన పంటలతో సిరుల పంట**

కేవలం వరికి మాత్రమే పరిమితం కాకుండా ఉద్యాన పంటల సాగు దిశగా కూడా ముందుకు సాగాలని.. ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల, పూల తోటల సాగు చేపట్టి రెండు నుంచి మూడు రెట్ల అధికా ఆదాయం పొందొచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ ఏడాది జిల్లాలో 4 వేల ఎకరాల ఉద్యాన పంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 3,800 ఎకరాల్లో చేపట్టడం జరిగిందన్నారు. పొలం గట్లపైనా మునగ వంటి పంటలు పండించవచ్చన్నారు. తాజా సమావేశంలో రైతులు తమ దృష్టికి తెచ్చిన వీటీపీఎస్ కాలుష్యం, గ్రీన్ బెల్ట్ వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

కార్యక్రమంలో గుంటుపల్లి సర్పంచ్ భూక్యా కవిత, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఏడీ శ్రీనివాసరావు, టెక్ ఏవో వాసుదేవ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి యడవల్లి రజని, పీఏసీఎస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, స్థానిక ప్రగతిశీల రైతులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్






**జగ్గయ్యపేట,ఆగస్టు 5,మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎంజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రమాదాల శ్రీనివాసు, అపిరాన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీనివాస్, అనిత ఎం.డీ. అపిరాన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, సైబర్ దంత వైద్యశాల ప్రతినిధి డాక్టర్ పి.శ్రీనివాస్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.విభిన్న రంగాల వైద్య నిపుణులు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేయబడింది అనీ మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ రావు అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కైలేపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యేకు తగదు...

**పెదపారుపూడి ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పై ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడం సరి కాదని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీ గోగం సురేష్ మండిపడ్డారు. పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో వైసీపీ నాయకులు మండవ బెనర్జీ ఇంటి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోగం సురేష్ మాట్లాడుతూ, మండలంలో వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధి పనులు మినహాయించి కూటమి ప్రభుత్వంలో ఒక అభివృద్ధి పని కూడా జరగలేదని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని నాయకులు తమ నాయకుడు కైలే అనిల్ పై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో 15 ఎకరాల భూమిని సేకరించి దాదాపు 600 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ కాలనీలకు రోడ్ల సౌకర్యం కల్పించడంతోపాటు విద్యుత్తు, తాగునీటి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే పలు గ్రామాల్లోని దళితవాడలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సిసి రోడ్ల నిర్మాణాన్ని కూడా చేపట్టామని ఆయన తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 15 నెలలు కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, అలాగే సంక్షేమ పథకాలు కూడా ఏమీ అమలు పరచలేదని ఆయన విమర్శించారు. ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం లేకుండానే తమపై అవినీతి బురద చల్లడం వారి అవివేకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గాని, తమ పార్టీ నాయకులు గాని ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు రుజువు చేస్తే తాము రాజకీయ సన్యాసం తీసుకుంటామని పేర్కొన్నారు. తాము చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, కూటమి నాయకులు వారు చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని ఆయన సవాల్



విసిరారు. లేనిపోని తప్పుడు ఆరోపణలతో తమపై బురద జల్లితే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలే వారికి తగిన విధంగా బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా సురేష్ హెచ్చరించారు.

అలాగే పామర్రు లో బస్టాండ్ అభివృద్ధికి కోటి రూపాయలను తమ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించి పనులను ప్రారంభించామని, ఈ లోగా ఎన్నికల కోడ్ అమలులోనికి రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. అనంతరం ఆ పనులు పూర్తయ్యాక తామే తెచ్చామని చెప్పడం తగదన్నారు. అంతేకాక పామర్రు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ కృషిచేసి 30 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయించారని, అంతేగాక భవనాల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం పనులను ఈ ప్రభుత్వ సమయంలో ప్రారంభించి నిధులు తెచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చీకుర్తి వరప్రసాద్, వైసిపి నాయకులు చిగురుపాటి శ్రీధర్, గోళ్ళ సోమేశ్వరరావు, జెడ్పిటిసి మాజీ సభ్యురాలు మూల్పూరి శిరీష, మాజీ ఎంపిపి చేబ్రోలు సుజాత, జాజుల నాగరాజు, శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మండవ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి పంపులు రెసిలెంట్ ఎగ్జిక్యూషన్, ఎక్స్‌పోర్ట్ మొమెంటం

**విజయవాడ, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** శక్తి పంపులు (ఇండియా) లిమిటెడ్ (ఎస్.పి.ఐ.ఎల్), జూన్ 30, 2025తో ముగిసిన త్రైమాసికానికి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటిదార్, కంపెనీ పనితీరుపై ఇలా వ్యాఖ్యానించారు, "మా వైవిధ్యభరితమైన వ్యాపార నమూనా యొక్క బలాన్ని ప్రతిబింబిస్తూ, ఎఫ్ వై26 కి బలమైన ప్రారంభాన్ని నివేదించడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ త్రైమాసికంలో మా పనితీరు సౌర పంపు విభాగంలో బలమైన అమలు, స్థిరమైన ఎగుమతి ఊపు, సామర్థ్యం, సాంకేతికతలో వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా నడిచింది. భారత దేశ ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలలో సుమారు 25% మార్కెట్ వాటాతో మేము పీఎం- కుసుమ్ పథకాన్ని ముందుకు నడిపిస్తున్నాము. ఆగస్టు 1, 2025 నాటికి, మా ఆర్డర్ బుక్ సుమారు రూ.1,350 కోట్లుగా ఉంది, దీనికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ మొదలైన రాష్ట్రాలలో స్థిరమైన ఇన్‌ఫ్లోలు, టెండర్లలో చురుకుగా పాల్గొనడం మద్దతు ఇచ్చింది. దశాబ్దానికి పైగా నిర్మించిన ఈ మార్కెట్లలో మా ఉనికి పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించుకోవడానికి మాకు మంచి స్థానాన్ని ఇస్తుంది.

**పీఎం సూర్య ఘర్:** ముఫ్త్ బిజిలీ యోజన వంటి ప్రభుత్వ చొరవల మద్దతుతో రూఫ్‌టాప్ సోలార్ విభాగం కూడా ఆకర్షణను పొందుతోంది. ఈ రంగంలో మా ప్రయత్నాలతో పాటు, మేము మా అడుగుజాడలను చురుకుగా విస్తరిస్తున్నాము. దేశీయ, పారిశ్రామిక, ఈవి విభాగాలు. మా ఎగుమతి వ్యాపారం కీలకమైన వృద్ధి లివర్‌గా కొనసాగుతోంది, గత నాలుగు సంవత్సరాలుగా 25% సిఏజీఆర్ ను అందిస్తోంది. హైతీ, ఉగాండా, బంగ్లాదేశ్, నేపాల్‌లలో విజయవంతమైన ప్రాజెక్టులు, యుఎస్ఏ, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా నుండి పెరుగుతున్న డిమాండ్‌తో, ఈ ఊపును కొనసాగించగల మా సామర్థ్యంపై మేము నమ్మకంగా ఉన్నాము. కార్యాచరణపరంగా, మా వర్కింగ్ క్యాపిటల్ సైకిల్‌ను ఆప్టిమైజ్ చేయడంలో మేము గణనీయమైన పురోగతి సాధించాము. స్వీకరించదగిన రోజులు ఎఫ్ వై 24లో 178 నుండి ఎఫ్ వై 25లో 152కి మెరుగుపడ్డాయి, ఎఫ్ వై 26 చివరి నాటికి సుమారు 120 రోజులకు తిరిగి రావాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము.



**మేము రూ. 1,700 కోట్ల క్యాపెక్స్ ప్లాన్‌ను అమలు చేస్తున్నాము, ఇందులో ఇవి ఉన్నాయి:**

- పంపులు, మోటార్లు, వీఎఫ్డిలు, సౌర నిర్మాణాలకు రెట్టింపు సామర్థ్యం (రూ. 250 కోట్లు)
- శక్తి ఈవి మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ (రూ. 250 కోట్లు) కింద ఈవి మోటార్, ఛార్జర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం
- పితంపూర్‌లో 2.2 జిడబ్ల్యు సోలార్ డిసిఆర్ సెల్, సోలార్ పివి మాడ్యూల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం, మధ్యప్రదేశ్ (రూ. 1,200 కోట్లు)

మేము క్యూఐపి ద్వారా రూ. 292.6 కోట్లు విజయవంతంగా సేకరించాము, ఇది మా సోలార్ డిసిఆర్ సెల్, సోలార్ పివి మాడ్యూల్ తయారీ ప్రాజెక్టుకు పాక్షికంగా నిధులు సమకూరుస్తుంది. మిగిలిన మొత్తాన్ని అంతర్గత అక్రూవల్స్, అప్పుల ద్వారా సమీకరిస్తాము. ముందుకు చూస్తే, ఎఫ్ వై 26లో 25-30% ఆదాయ వృద్ధిని అందించడానికి, రాబోయే 3-4 సం. లలో ఈ పథాన్ని కొనసాగించడానికి మేము కట్టుబడి ఉన్నాము. కార్యాచరణ క్రమశిక్షణ, బలమైన ఆర్డర్ పైప్‌లైన్ ద్వారా మద్దతు ఇవ్వబడిన క్లీన్ ఎనర్జీపై మా వ్యూహాత్మక దృష్టి దీర్ఘకాలిక విలువ సృష్టికి మమ్మల్ని బాగా ఉంచుతుంది.

## జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి షటిల్ పోటీలు

**గన్నవరం, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** క్రీడా పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ఆగస్టు 7వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను గన్నవరం లోని కే.వి.ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి కే. ఝాన్సీ లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ పోటీలకు 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలురు, బాలికలు మాత్రమే అర్హులు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, పదవ తరగతి సర్టిఫికెట్లతో హాజరు కావాల్సిందిగా ఆమె సూచించారు. పోటీలకు ముందుగా ఎంట్రీ నమోదు అవసరం ఉందని, ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలకు కిషోర్ ని 98850 68099 నంబర్‌లో సంప్రదించవచ్చని కే. ఝాన్సీ లక్ష్మి తెలిపారు.

## పేద విద్యార్థులకు రావెళ్ల ఫౌండేషన్ అండగా నిలుస్తోంది



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** పేద విద్యార్థులకు రావెళ్ల ఫౌండేషన్ అండగా నిలుస్తున్నట్లు చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ తెలిపారు. మంగళవారం చల్లపల్లిలో ఆముదార్లంక గ్రామానికి చెందిన పేద విద్యార్థి వేములపల్లి వంశీ విద్యాభ్యాసం కోసం రావెళ్ళ ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అతని తల్లి నాగమల్లేశ్వరికి దిలీప్ కుమార్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, బీసీ నాయకులు జన్ను నాంచారయ్య, బోలెం సాయిబాబు, పఠాన్ జిలాని పాల్గొన్నారు.

## సీఎంకి దివిసీమ ప్రాంతవాసుల కృతజ్ఞతలు



**నాగాయలంక ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరుపెట్టాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల హర్షణీయం వ్యక్తపరిచినారు. ఉమ్మడి రాష్ట్రం లో అధికార భాషాసంఘం, ఏర్పాటు కావడానికి మండలి వెంకటకృష్ణారావు ముఖ్యకారకుడు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చెప్పడం తెలుగుభాష అంటేముఖ్యమంత్రికి ఉన్న అభిమానానికి నిదర్శనం, అంతేకాదు మండలి వెంకటకృష్ణారావు అంటే ఎంతటి గౌరవం ఉందో ముఖ్యమంత్రికి మాటల్లో అర్థం చేసుకొనవచ్చును, మండలి వెంకటకృష్ణారావు, శతజయంతి ఉత్సవాలు రెండోవరోజుల్లో భాగముగా, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఏడాదిపాటు, ప్రతిదినము, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేయాలని వారి సేవలను కొనియాడుతూ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తలశిల స్వర్ణలత, భావదేవరపల్లిసర్పంచ్ మండలి. ఉదయభాస్కర్ రేమాల బాబురావు, భోగాది శివవిష్ణు, బండ్రెడ్డి హరి, తోట. మానస, మాది వాడ అర్జునరావు, అభిమానులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసినారు.

## హేమలతకు వైద్య సహాయం అందజేసిన కమ్మవారి ఐక్య సేవాసమితి



**గన్నవరం (హనుమాన్ జంక్షన్), ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** వైద్య సహాయం కోసం కోరిన పేద కుటుంబానికి కమ్మవారి ఐక్య సేవాసమితి ఆంధ్రప్రదేశ్ మరోసారి చేయూతనిచ్చింది. బాపులపాడు మండలానికి చెందిన చింగలూరి హేమలతకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆమె కాలు, చెయ్యి పనిచేయకపోవడంతో తీవ్రంగా బాధపడుతోంది. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో వైద్యం చేయించుకునే స్థితి లేకపోవటాన్ని దృష్టిలో పెట్టుకుని, సేవాసమితి మానవతా దృక్పథంతో స్పందించింది. దాతల సహకారంతో సమితి రూ.30,336 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసి, చెక్కును హేమలతకు స్వయంగా ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ, గౌరవ సలహాదారులు అట్లూరి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరుచూరి రామకృష్ణ మాట్లాడుతూ, ఇది మా 246వ సేవా కార్యక్రమం. గత ఐదు సంవత్సరాలలో 246 మంది నిరుపేదలకు రూ.1 కోటి విలువైన ఆర్థిక సహాయం అందించాం. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా, వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు ఆహారం, మందులు, ఇతర అవసరాలు అందిస్తూ మానవ సేవలో ముందుండుతున్నాం, అని చెప్పారు. గౌరవ సలహాదారులు అట్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ... కుల, మతాలకు అతీతంగా సేవలు అందించడం మా ధ్యేయం. పేద విద్యార్థులు, వైద్యం చేయించుకోలేని కుటుంబాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి మందులు, ఆహారం వంటి అవసరాలను తీర్చే కార్యక్రమాల్లో మా సేవాసమితి ముందుంటోంది," అని వివరించారు. ఈ సేవా కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పొట్లూరి శ్రీ సత్య పణీంద్ర కుమార్, వీరమాచినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




## విశాఖపట్నం, తిరుమలలో 5జీ సేవలు ప్రారంభిస్తున్న వి

**విజయవాడ, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** విశాఖపట్నం, తిరుమలలో 5జీ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు టెలికాం దిగ్గజం వి వెల్లడించింది. దేశవ్యాప్తంగా తమకు 5జీ స్పెక్ట్రం ఉన్న 17 ప్రయారిటీ సర్కిల్స్‌లోని పలు నగరాల్లో 5జీ సేవలను ప్రవేశపెట్టే ప్రక్రియలో ఇది భాగమని వివరించింది. దశలవారీగా 5జీ విస్తరణలో భాగంగా వి ఇప్పటికే ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, మైసూరు, నాగ్‌పూర్, చండీగఢ్, పాట్నా, జైపూర్, సోనిపట్, అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్, వడోదర, ఛత్రపతి శంభాజీనగర్, నాసిక్, మీరట్, మలప్పురం, కోజికోడ్‌లో 5జీ సేవలను ప్రవేశపెట్టింది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో వి కొత్త తరం కనెక్టివిటీని పొందే మొదటి నగరంగా విశాఖపట్నం నిలుస్తుంది. విశాఖపట్నం, తిరుమలలో 5జీ ఎనేబుల్డ్ డివైజ్‌లు గల వి యూజర్లు 5జీ సర్వీసులను పొందవచ్చు.

## కాలిఫోర్నియా బాదంతో ఆరోగ్యకరంగా రక్షా బంధన్‌ను వేడుక చేసుకోండి




**విజయవాడ, ఆగస్టు 5, మేజర్ న్యూస్ :** పండుగ సీజన్ ప్రారంభాన్ని రక్షా బంధన్ సూచిస్తుంది. తోబుట్టువుల మధ్య బంధాన్ని ఇది వేడుక చేస్తోంది. ఈ సంవత్సరం, మీ తోబుట్టువుల దీర్ఘకాలిక విజయం, శ్రేయస్సు కోసం ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా మార్చటం ద్వారా ఆ హృదయపూర్వక వాగ్దానాన్ని ఆలోచనాత్మక సంజ్ఞతో గౌరవించండి. పండుగలు తరచుగా ఆనందకరమైన భోజనం, తీపి వంటకాలతో వస్తాయి. కానీ, ఆ ఆనందాన్ని బుద్ధిపూర్వక ఎంపికలతో సమతుల్యం చేసుకోవడం ముఖ్యం. ఈ రక్షా బంధన్ వేళ, కాలిఫోర్నియా బాదం వంటి పోషకమైన ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చడం ద్వారా వేడుకలను మరింత అర్థవంతంగా మార్చుకోండి.

## గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా డివి



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** రూరల్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులుగా నందిగామ ప్రాంతానికి చెందిన డివి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పుట్టం శ్రీనివాసరావు రాష్ట్ర కోశాధికారిగా మంద బసవరాజు సభ్యులుగా కే వీరన్న కే నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఈ మీటింగ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా కొమ్మవరపు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా వెల్లంకి రాంబాబు జిల్లా కోశాధికారిగా బి గురునాథం ఎన్నికయ్యారు. నందిగామ డివిజన్ అధ్యక్షులుగా నిమ్మనంపూడి ప్రతాప్ కార్యదర్శిగా శీలం రాము కోశాధికారిగా ఎస్కే రంజాన్ ప్రచార కార్యదర్శిగా ఐ రాజు ఎన్నికైనారు ఈరోజు విజయవాడలో ప్రెస్ క్లబ్ లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంకు పెండ్లి కార్డు అందజేసిన గాడిపర్తి శ్రీనివాస్



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** గొళ్ళమూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తన మేనకోడలు పెళ్లి కార్డును ముఖ్యమంత్రికి గాడిపర్తి శ్రీనివాస్ రావు అందజేశారు.



## స్మార్ట్ మీటర్లు వద్దు మామూలు మీటర్లు ముద్దు..

**కోడూరు మేజర్ న్యూస్ :** ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్స్ బిగిస్తోందని, అవి స్మార్ట్ మీటర్లు కావని, విద్యుత్తు చార్జీలు పెంచే మీటర్లని సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు నాయకులు అన్నారు. కోడూరు మండలం విశ్వనాథపల్లిలో పంచాయితీ కరెంటు సబ్స్టేషన్ వద్ద మంగళవారం సిపిఎం నాయకులు స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే నష్టాన్ని, కరపత్రాలు పంచి, ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వ్యాపార సంస్థలకు కొన్నిచోట్ల బిగించారని, ఈ మీటర్ల వల్ల బిల్లులు అధికంగా వస్తున్నాయన్నారు. నారా లోకేష్ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి, కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని చెప్పి అధికారంలోకి వస్తూనే, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు అన్నారు. విశ్వనాథ పల్లి లో సబ్ స్టేషన్ వద్ద నినాదాలు చేస్తూ వినతి పత్రాన్ని అధికారులకు అందించారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి మోహన్ రావు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం పోలినాయుడు మత్స్య కార్మిక సంఘం కొప్పనాతి తాతయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ కాగితాల సుదర్శన్ రావు తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## ఎస్ఆర్ జిఇసి స్టుడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు లో శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త విద్యార్థులకు అవసరమైన సమాచారం, విద్యార్థులకు సంస్థ యొక్క మౌలిక సదుపాయాలు నియమ నిబంధనలు గురించి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గుడివాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వి.ధీరజ్ వినిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వి.ధీరజ్ వినిల్ మాట్లాడుతూ ఎన్ డి పి ఎస్ చట్టం యొక్క ముఖ్య అంశాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల పదార్థాలు అమ్మకం, కొనుగోలు, రవాణా, చేయడం నేరము, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరస్థులకు ఆశ్రయం కల్పించిన వారు కూడా శిక్షర్హులు అవుతారు అని తెలిపారు. అదేవిధంగా చదువుల్లో విద్యార్థులు బాగా రాణించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సోమేశ్వరరావు గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వి వి సత్యనారాయణ, కాలేజీ ప్రిన్సిపల్ బుర్రా కరుణ కుమార్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ న్యాయ సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఉమ్మడి కృష్ణాజిల్లా శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో వైయస్సార్సీపి రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ని నందిగామ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ అధ్యక్షులు షేక్ సైదా మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ న్యాయవాదులు.కేంద్ర కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల జోనల్ వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ న్యాయవాదుల సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, ఉమ్మడి కృష్ణ, గుంటూరు జోనల్ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ లీగల్ సెల్ అధ్యక్షులు ఒగ్గు గావాస్కర్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు సాయిరాం, నియోజకవర్గం వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ న్యాయవాదులు కన్నెగంటి జివరత్నం, బండి మల్లికార్జునరావు, పింగళి లక్ష్మీ నరసింహరావు, ఈశ్వర ప్రగడ రంగారావు, మంగళ పూడి ముక్తేశ్వరరావు (సన్నీ) మహమ్మద్ అమీన్, ఆనందం విజయభాస్కర్, మద్దుకూరి శిరీష, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజలకు అతి చేరువగా వాట్సప్ గవర్నెన్స్

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమం 'వాట్సప్ గవర్నెన్స్'. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను, వినతులను సులభంగా అధికారులకు చేరవేయవచ్చు, వివిధ ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ఈ నేపథ్యంలో, మంగళవారం గాంధీ సెంటర్ నుంచి మెయిన్ బజార్ వరకు నిర్వహించిన వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.ఈ ర్యాలీలో ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య ఆశయాలకు కట్టుబడి, పాలనను ప్రజల వద్దకే తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు తమ ఇంటి నుంచే 161 రకాల పౌర సేవలను పొందవచ్చు. ఇది పారదర్శక, సమర్థవంతమైన పాలనకు ఒక మైలురాయి," అని అన్నారు.ర్యాలీలో ప్రజలు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొని, 'మన మిత్ర' పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా, వాట్సాప్ గవర్నెన్స్ కోసం కేటాయించిన అధికారిక నంబర్ 9552300009 ద్వారా సేవలను ఎలా పొందాలో ప్రజలకు తెలియజేశారు. తంగిరాల సౌమ్య మరోమారు ప్రజలను ఉద్దేశించి, "ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో మన ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నాను," అని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్ పట్ల ఉత్సాహం, అవగాహన పెరిగింది, ఇది రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రజాకేంద్రిత విధానానికి నిదర్శనంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ లోవరాజ్, మండల ఎమ్మార్వో సురేష్, అధికారులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సింగలూరు మంచినీటి సమస్య పరిష్కారంకు ఎమ్మెల్యే రాము హామీ

**గుడ్లవల్లేరు ఆగస్టు 5 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, చంద్రాల పంచాయతీ శివారు సింగలూరు గ్రామస్తులు సంఘసేవకులు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ నేతృత్వంలో స్థానిక గుడివాడ ఎంఎల్ఎ వెనిగండ్ల రామును మంగళవారం గుడివాడలో కలసి మంచినీటి సమస్యను వివరించి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 2006 లో మా సింగలూరు గ్రామం "ఓగ్ని " తుఫాను వ ముంపునకు గురైన నాటినుండి గ్రామస్తులు అందరము రాజకీయాలకతీతంగా సమైక్యమై ఒక ఆదర్శగ్రామం నిర్మించుకోవటంలో ఇతర గ్రామాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న మా గ్రామ జీవనానికి ప్రధాన వనరైన మంచినీటికి సమస్య ఏర్పడిందని తెలిపారు. 7 దశాబ్దాలుగా పంచాయతీ మంచినీటి చెరువుకు నీరు నింపే ప్రైవేటు బోదెపై రైతు అభ్యంతర పెట్టడంతో, మే. 19న మండల అధికారులకు, జూన్ 23న జిల్లా కలక్టరుకు మంచినీటి పారుదల, మంచినీటి చెరువు పరిరక్షణకు విన్నవించుకున్నా పరిష్కారం లభించలేదన్నారు. తదనంతరం గ్రామస్తుల ఖర్చుతో 260 అడుగులు లోతు బోరు వేయిస్తే ఉప్పనీరుతో ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. ప్రస్తుతం పంచాయతీ ఆధ్వర్యంలో పక్కనే వున్న మరో బోదె ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిలో రైతుల పొలాల నుండి వస్తున్న మురుగు నీరు, రసాయనాలు కలుస్తుండడంతో అనారోగ్యం, చర్మ వ్యాధులు వస్తున్నాయని మహిళలు వాపోయారు. మా ఎంఎల్ఎ గా తమరు సమస్య తీవ్రతను గుర్తించి విశేష అధికారాలతో గతా డెబ్బది సంవత్సరముల నుండి గ్రామ పంచాయతో మంచినీటి చెరువుకు అతిదగ్గరలో వున్న మంచినీటి వనరు ద్వారా నీరు పెట్టుకొనుటకు "ఈజ్ మెంట్ రైట్ " కూడా పరిగణించి తగు చర్యలు



తీసుకొని గ్రామస్తులకు మంచినీటి సౌకర్యం కల్పించి, చెరువు పరిరక్షణ చేయాలని సింగలూరు గ్రామస్తులు పురుషులు, మహిళలు విన్నవించారు.

**స్పందించిన ఎంఎల్ఎ రాము హామీ :** స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము సింగలూరు గ్రామస్తుల వినతిపై వెనువెంటనే స్పందిస్తూ గుడ్లవల్లేరు మండల అధికారుల వివరణ తీసుకున్నారు. అలాగే మీలో ఒకడిగా మీ సమస్య నా సమస్యేనంటూ మంచినీటి సమస్య పరిష్కారంకు వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరిస్తానని, జిల్లా కలెక్టరుతో కూడా మాట్లాడి చెరువు పరిరక్షణకు కూడా చర్యలు చేపడతానని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సింగలూరు గ్రామస్తులకు ముఖ్యంగా మహిళలకు ఎంఎల్ఎ రాము హామీ యిచ్చారు. అదేవిధంగా సింగలూరు గ్రామాన్ని కూడా త్వరలోనే సందర్శిస్తానని పేర్కొనడం గమనార్హం.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా



**నందిగామ, ఆగస్టు 5, మేజర్ న్యూస్:** పెంచిన విద్యుత్ సర్దబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం నందిగామ విద్యుత్ ఎడి కార్యాలయం వద్ద దర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఎన్.సి.హెచ్ సుప్రజ, చుండూరు సుబ్బారావు, కటారపు గోపాల్ లు మాట్లాడుతూ లు ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకుప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్, ఈనాడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వటంతోపాటు, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయకుండా వాటిని కొనసాగించడం రాష్ట్ర ప్రజలను నమ్మకద్రోహం చేయడమే అవుతుందన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కానీ, సంవత్సరంలో 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలను అదనంగా మోపారని తెలిపారు. మొత్తం 4రకాల సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్.పి.పి.సి.ఏ) వసూలు చేస్తున్నారని తెలిపారు. దీంతో బిల్లులు అధికంగా వస్తున్నాయ స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం షాపులు, చిన్నపరిశ్రమలు రెండు, మూడు రెట్లు, కొందరికి 10రెట్లు ఛార్జీలు పెరిగాయన్నారు. మీటర్లకు అయ్యే ఖర్చు రూ.10వేల-17వేల వరకు దశలవారీగా వినియోగదారులమైన మాపైనే మోపడం మరింత దారుణమన్నారు. అధిక విద్యుత్ వినియోగించే సమయాలలో అధికరేట్లు నిర్ణయించి వసూలు చేయడం అన్యాయ మన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల అందరిపై అధిక భారం పడుతుందన్నారు. కరెంట్ బిల్లులు ఆన్లైన్లో పంపడం వల్ల బిల్లులకు జవాబుదారితనం ఉండదని తెలిపారు. అదానీ స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాఇంటికి స్మార్ట్ మీటర్ బిగించడాన్ని మేము వ్యతిరేకస్తున్నామని తెలిపారు. పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని, గృహాలకు స్మార్టోమీర్లు పెట్టవద్దని, షాపులు, సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, సర్దుబాటు ఛార్జీలు పూర్తిగా రద్దు చేసి బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ ఖాసిం, చనుమోలు సైదులు, గోపి నాయిక్, కట్టా చామంతి, బి. లాజర్,కరి వెంకటేశ్వరావు, రఘు, పుల్లయ్య,హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపారస్తులకు వాట్సప్ గవర్నెన్స్ పై అవగాహన

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు పంచాయతీ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర – ప్రజల చేతిలో రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమంపై వ్యాపారస్తులు, దుకాణదారులకు కరపత్రాలతో అవగాహన కలుగచేసారు. అనంతరం పంచాయతీ కార్యాలయం సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వాట్సప్ మొబైల్ నెం9552300009కు హాయ్ అంటూ సందేశం పంపించి, కావలసిన సేవలను ఎంపిక చేసుకుని సందేశం పంపడం ద్వారా ధృవీకరణ పత్రాలు, చెల్లింపుల రశీదులు షాపుల వద్ద, ఇంటివద్ద వుండే పొందుకో వచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది దుర్గారావు, నాగ రాజు, పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిషేధం, పిల్లల కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మాట్లాడుతూ కమిషన్ తో పాటు అన్ని శాఖలు కలిసి బాలల కోసం ఏర్పాటు చేసిన చట్టాలన్నీ సక్రమంగా అమలుపరిచే బాధ్యత అందరిదీ అని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి కోసం చేసిన చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్, వసతి గృహాల్లో జాతీయ బాలల హక్కుల కమిషన్ వారి సూచనలు తప్పక పాటించాలని సూచించారు. సమాజంలో బాల్యవివాహాలు అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, టీనేజ్ ప్రెగ్నెన్సీ మీద దృష్టి సారించి జిల్లాలో వీటి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని, ఫిర్యాదుల పెట్టె తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్, ప్రహరీ క్లబ్స్, శక్తి, హెల్త్, లైంగిక వేధింపుల నివారణ, ఫుడ్, పరిశుభ్రత, చైల్డ్ ప్రొటెక్షన్ తదితర కమిటీలు నిర్వహిస్తూ వాటికి రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే కమిషన్ తరుపున చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడూ బాలల రక్షణ కోసం కొత్త చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయని అన్నారు. పిల్లలకు సంబంధించిన సమస్యల కోసం 1098 లేదా 100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసినట్లయితే వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. ప్రతి పాఠశాలలో క్రీడా మైదానాలు, గేమ్స్ అవర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకూ డదన్నారు. ఒత్తిడితో కూడిన చదువులు కాకుండా సానుకూల దృక్పథంతో కూడిన చదువులు, విలువలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థలు తప్పనిసరిగా బయట ఫీజుల వివరాలు ప్రదర్శించాలని లేనిపక్షంలో నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. జీవించే హక్కు అనేది పిల్లల హక్కు అని, వారికి పౌష్టిక ఆహారం అందించాలని, రక్త హీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించడం, హెల్త్ క్యాంపులు తప్పనిసరిగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల లేదా కళాశాలకు వంద మీటర్ల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, వైన్ షాపులు ఉంటే తప్పనిసరిగా మూసివేయాలని, బాల నేరస్థులు తయారు కాకుండా ఉండేందుకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను జోలికి పోకుండా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ కే చంద్రశేఖరరావు, ఏఎస్పి వీవీ నాయుడు, డీఎస్పీ జి శ్రీనివాసరావు, డీఈఓ పీవీజే రామారావు, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులు షేక్ షాహిద్ బాబు, ఫణి ధూర్జటి, జి రమేష్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, ఎంఈఓ లు, ప్రిన్సిపాళ్ళు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# బలవంతపు ఆదాని స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి



**పెడన,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్ స్టేషన్ల వద్ద జరుగుతున్న ధర్నాలో భాగంగా ప్రజా సంఘాల పిలుపుమేరకు పట్టణంలో గల సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందని సిపిఐ సిపిఎం నాయకులు తెలిపారు. ఈ మేరకు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ అధికారికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అవసరం లేనటువంటి విద్యుత్ స్మార్ట్ మీటర్లను బలవంతంగా రుద్దుతూ విద్యుత్ బిల్లులు విపరీతంగా రావడానికి స్మార్ట్ మీటర్లు ప్రజలకు బలవంతంగా అంటగట్టాలని అలాగే ట్రూ అప్ చార్జీలు పేరుతో గత నాలుగేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు బిల్లులు వసూలు చేయటం అనేది అత్యంత దుర్మార్గమైన విషయం ఇటువంటి కార్యక్రమాలు గత వైసిపి నిర్వహిస్తే అది బాదుడే బాదుడు అన్న వంకతో రాష్ట్రమంతా కూటమి ప్రభుత్వం అప్పట్లో ప్రచారం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇవే పోకడలు అవలంభిస్తూ ఈ స్మార్ట్ మీటర్లను బలవంతంగా అంటగడుతున్నారన్నారు. ఈ విద్యుత్ ఒప్పందాలని వెంటనే రద్దు చేయాలని పెడన సబ్ స్టేషన్ జే ఈ పాండురంగారావు కి మెమోరాండం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గోరు రాజు సిఐటియు నాయకులు పంచల రామనరసింహారావు పుట్ల పేరలింగం చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వాసా గంగాధర్ రావు సిపిఐ నాయకులు కట్ట హేమ సుందర్ రావు పేరిశెట్టి ఉమాకాంత్ రావు తుమ్మ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలపై సీఎంని కలిసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్





జగ్గయ్యపేట, ఆగస్టు 5, మేజర్ న్యూస్: శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గానికి సంబంధించిన కీలక సమస్యలపై చర్చించారుఈ సందర్భంగా, 2023%-%24 వరుసగా వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న మునేరు నది పాత ఆనకట్టు, మునేరు కాలువలు, కాచవరం కాలువ మరమ్మత్తులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వరదల ప్రభావంతో సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయి. శాసనసభ్యులు ప్రధానంగా కోరిన అంశాలలో ఎఫ్డీఆర్ కింద మునేరు, కాచవరం కాలువల మరమ్మత్తుల కోసం రూ.3.30 కోట్లు మంజూరు చేయాలని మునేరు పాత ఆనకట్టు తక్షణ మరమ్మత్తుల కోసం రూ.19.09 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ 2025-26లో పంటలకు సాగునీరు అందించేందుకు మునేరు నదిలో తాత్కాలికంగా రింగ్ బండ్లు నిర్మించేందుకు రూ.71.25 లక్షలు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కోరారువత్సవాయి మండలంలోని పోలంపల్లి వద్ద ఉన్న 1894లో నిర్మితమైన మునేరు ఆనకట్టు కింద, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని సుమారు 25 గ్రామాలకు చెందిన 36,000 ఎకరాల ఆయకట్టు సాగునీటి పై ఆధారపడినది. వరదల కారణంగా పలు చోట్ల గండులు ఏర్పడి, కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే డిపార్ట్మెంట్ అధికారులు అంచనాలు సిద్ధం చేసి, సంబంధిత శాఖలకు నివేదికలు పంపారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఖరీఫ్ పంటలకు సాగునీరు అందకుండా, వేలాది మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కి వివరించారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన దశల్లో ఆర్థిక శాఖతో సమన్వయం చేసి, తక్షణ నిధుల మంజూరు కొరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందన పట్ల శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయకట్టు రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీ జనార్దన్, పొన్నం నరసింహారావు, పొన్నం బాలాజీ, తోట నాగమల్లేశ్వరరావు(బుజ్జి), విశ్వనాథం, గాదిపర్తి శ్రీను, మౌలేశ్వర రావు, తోట వెంకటాద్రి పాల్గొన్నారు.

## 'మైత్రి' ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "పర్యావరణ పరిరక్షణ -మనందరి బాధ్యత "అనే కార్యక్రమం నిర్వహించి, 17 వేల రూపాయలు విలువచేసే 15 మొక్కలకు సంరక్షణ కల్పించే విధంగా "ట్రీ గార్డ్స్, అందించారు. స్థానిక టిడ్కో కాలనీలో మంగళవారం వీటిని ఏర్పాటు చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా 100 మొక్కలను, మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాటడం జరిగింది. వాటికి ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేసారు. కాలనీ కార్యనిర్వాహక బృందం సభ్యులు ఈ మొక్కలు, పశువుల బారినపడకుండా "ట్రీ గార్డ్స్" వితరణ చేయవలసిందిగా కోరిన మీదట వాటిని 'మైత్రి' ఏర్పాటు చేశారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్, కాసాని ప్రసాద్, వక్కంటి రమాదేవి పాల్గొన్నారు. టిడ్కో కాలనీ ప్రతినిధులు సత్యనారాయణ, నజీర్, వీరబాబు లు మైత్రి ఫౌండేషన్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం చిలకలపూడి గోడౌన్స్ ఎదురుగా ఉన్న అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఈరోజు మొదటి మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణలు అభిషేకాలు ఆకు పూజలు నిర్వహించారు. ఆలయ భక్త బృందం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన అన్న సమారాధనలో వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని వెంట్రప్రగడ షణ్ముఖ ప్రసాద్ పర్యవేక్షించారు.

## వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన ర్యాలీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కానూరులో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్ పై అవగా హన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ మాట్లా డుతూ వాట్సాప్ ద్వారా పబ్లిక్ సర్వీస్ లను కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిందని 161 పబ్లిక్ సర్వీసెస్ తో ప్రారంభం అయి ఇప్పుడు 200 పబ్లిక్ సర్వీసెస్ తో అతి తక్కువ కాలంలో ప్రజలకు మరింత చేరువయిందన్నారు. దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, విద్యార్థుల హాల్ టిక్కెట్లు తదితర సేవలు మనం నిత్యం వాడే వాట్సాప్ లో వినియోగించుకోవచ్చన్నారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర రావు, దివి మహేష్, ఏడుకొండలు, బొమ్మిడి పెద ఏడుకొండలు, రాము, నాని, ప్రభుదాస్, గోపు వెంకట రమణ, మోపిదేవి కృష్ణ, అంగన్వాడీ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్, ఆశా వర్కర్లు, బుక్ కీపర్లు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కు అందజేసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ హోంగార్డ్ కు హోమ్ గార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ నుండి సేకరించిన మొత్తాన్ని చెక్ రూపంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు,, హోంగార్డ్స్ ఆర్ఐ రవికుమార్ తో కలిసి వారికి అందజేశారు. పదవి విరమణ పొందిన హెచ్జి-56 వై.వెంకటేశ్వరమ్మకి 3,79,140 రూపాయిలు చెక్కును జిల్లా ఎస్పీ అందజేశారు. ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో మీకు ఎలాంటి సమస్య వచ్చినా, ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా తమకు తెలుపుకోవచ్చని, మీరు ఎప్పటికీ పోలీస్ కుటుంబ సభ్యులేనని, పోలీస్ శాఖ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా కచ్చితంగా పన్ను కట్టాలి



- ఖాళీ స్థలాల పన్నుబకాయల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- వేకెన్ట్ ల్యాండ్ టాక్స్ కమిటీ
- కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ ఛాంబర్ లో వేకెన్ట్ ల్యాండ్ టాక్స్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఖాళీ స్థలాల పన్ను వసూలు చేయటం కోసం, విజయవాడ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం తో పాటు జిల్లా రెవెన్యూ శాఖ, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖా సమన్వయం అవసరమని గుర్తించి ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశాని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర విన్నవించగా, కలెక్టర్ అనుమతితో వేకెన్ట్ ల్యాండ్ టాక్స్ కమిటీ ఏర్పాటయినా తర్వాత మొదటి సమావేశం మంగళవారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం నిర్వహించారు. ఖాళీ స్థలాల పన్నుల డిమాండ్ గత సంవత్సరం 237 కోట్ల రూపాయల్లో ఉంటే వసూలు కేవలం 19 కోట్లు మాత్రమే వస్తుందని, బకాయిలు ఉన్న ఖాళీ స్థలాల పన్నులు యజమానులు తెలియకపోవటం వల్ల వసూలు చేయలేకపోతున్నారని, అందుకోసం ఈ ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేశారని, విజయవాడ నగర పాలక సంస్థ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం నగర పరిధిలోని ఖాళీ స్థలాల సంబంధించిన డాక్యుమెంట్ వివరాలు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకి అందించిన వెంటనే స్థలం విక్రయాల డాక్యుమెంట్ ఆధారంగా, యజమానుల వివరాలు తెలుసుకోవడమే కాకుండా వారు ఆ డాక్యుమెంట్లో సమర్పించిన అడ్రస్ ఆధారంగా వారికి నోటీసులు జారీ చెయ్యాలని ఈ సమావేశంలో చర్చించారు. ఖాళీ స్థలాల పన్నుబకాయల జాబితాను సర్కిల్, వార్డ్, సచివాలయం వారీగా విభజించి ప్రతి ఖాళీ స్థలం యజమానిని కనుక్కొని వాళ్లకి నోటీసులు జారీ చేయాలని, విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోగల ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా సరే వారికున్న ఖాళీ స్థలాల పన్ను బకాయిలను చెల్లించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్.డి.వో కె. చైతన్య, డిస్టిక్ రిజిస్టర్ పి. వి.వి దుర్గాప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఎ యు బి శర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

# మనమిత్ర వాట్సాప్ యాప్ సద్వినియోగం చేసుకోండి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మనమిత్ర యాప్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. గోపీచంద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వాట్సాప్ గవర్నెనెన్స్ పై ప్రతినెల 5వ తేదీన అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మనమిత్ర యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు.ప్రజలు వారి ఇంటి వద్ద నుండే త్వరితగతిన ప్రభుత్వ సేవలు పొందే విధంగా కూటమి ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ యాప్ ను ప్రజలకు చేరువ చేసిందని, ఈ యాప్ పై ప్రజలు అవగాహన కలిగి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాప్ వాట్సాప్ నెంబర్ 9552300009. ఇది అధికారిక యాప్ అన్నారు. రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ల సంకల్పానికి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు పోగొట్టడానికి పి 4 పథకం బాగా దోహదపడుతుందన్నారు. 45వ డివిజన్ సచివాలయంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగులు, వారు



పనిచేసే డివిజన్ లలో కూడా ప్రజలకు మరిన్ని సేవలందించి ఇష్టపడి పని చేయాలన్నారు. డివిజన్ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన వారిని ఘనంగా సత్కరించి అభినందించడం జరిగింది.సచివాలయ సిబ్బంది,రవి ప్రసాద్,కాళీ చరణ్, రామ శేఖర్,రమాదేవి, సాయి కవిత, మానస, తేజస్వి, ప్రభావతి, పాల్గొన్నారు.



## ప్రతీ రికార్డును సమర్ధవంతంగా నిర్వహించుకోవాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో విభాగాన్ని సందర్శించి, విభాగపు పని తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా విభాగంలో నమోదైన సమాచారాన్ని, డిజిటల్ డేటా నిర్వహణ విధానాలను పరిశీలించారు. సెక్షన్ల వారీగా నిర్వహిస్తున్న ప్రతి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించి అన్ని విభాగాలను సమన్వయ పరుచుకుంటూ ఎప్పటికప్పుడు డేటాను అప్డేట్ చేస్తూ ఉండాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ నేరగాళ్ల వివరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమగ్రంగా నమోదు చేయడం ద్వారా దర్యాప్తుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు.నేర గమనాన్ని అంచనా వేసే విషయంలో డీసీఆర్బీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కేసుల విషయంలో శీఘ్ర సమాచారం అందించే విధంగా పని చేయాలని, డేటా ఏకీకృతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పనిచేసే ప్రదేశం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సిబ్బందికి మానసిక ఉల్లాసం కలుగుతుందని, పని ఒత్తిడి దూరం అవుతుందని తెలిపారు.

### విదేశాల్లో గజ ఈత పోటీలకు ఎంపికైన

## చిన్నారులకు బొల్లా రాజేష్ ఆర్థిక సాయం





**పెడన, మేజర్ న్యూస్:** గజ ఈత పోటీలలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎం తులసి చైతన్య తాను అవార్డులు పొందటమే కాకుండా తన కుమార్తె, ఇద్దరు చిన్నారులను ఈత కొట్టడంలో మంచి ప్రావీణ్యాన్ని నేర్పించడంతో ఆ ముగ్గురు చిన్నారులు విదేశాలలో ఈతల పోటీలలో అతి లోతైన సరస్సులో సుమారు ఐదు కిలోమీటర్లు ఎంపిక కావడం వల్ల విదేశాలకు వెళ్లేందుకు (ప్రోత్సాహం కింద )వారికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం కింద నగదును అందించామని గూడూరు మండలం ఆకుమర్రు గ్రామ టిడిపి నాయకులు బొల్లా రాజేష్ తెలిపారు. ఈ మేరకు నగదును ఆ ముగ్గురు చిన్నారులకు స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో ఇటువంటి చిన్నారులను ప్రోత్సహించాలని తెలపడంతో గతంలో పెడన నియోజవర్గంలో ఉండి విజయవాడలో స్థిరపడిన మోత్కూరి తమోగ్న 5 సం", మన్నెం నాగసాయి ఆశ్రిత 5 సం" తిన్నలూరి ఆర్యానికి 5సం" జర్మనీ( లండౌ ) నుండి ఆష్టియా (బెంజంజు) బోడిన్సీ సరస్సు అతిపెద్ద లోతైన సరస్సు 5 కిలోమీటర్ల ఈత కొట్టడానికి ఈ చిన్నారులు వెళ్ళటంతో తెలుగువారిగా గర్విస్తూ ఈ ముగ్గురు చిన్నారులు విజయం సాధించాలని కోరుకుంటున్నామన్నారు. అతి చిన్న వయసులోనే ఇటువంటి సాహస కృత్యాలు చేస్తున్న ఈ చిన్నారులకు హార్దిక సహాయం చేస్తున్నందుకు గర్విస్తున్నానని తెలిపారు.



## గవర్నర్ అశోక్ గజపతి రాజు దంపతులకు టీడీపీ ఎంపీలు సన్మానం

**విజయవాడ/ఢిల్లీ, మేజర్ న్యూస్ :** కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఆయన నివాసానికి ఢిల్లీ పర్యటనలో వున్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, సతీమణి సునీలా గజపతిరాజు మంగళవారం విచ్చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్ అశోక్ గజపతి రాజు దంపతులతో పాటు టిడిపి ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం అశోక్ గజపతి రాజు-సునీలా గజపతి రాజులను టిడిపి ఎంపీలందరూ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి,వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయ్ శ్రీనివాస్, కలిశెట్టి అప్పల నాయుడు, ఎం.శ్రీ భరత్, రాజ్యసభ ఎంపీ లు సానా సతీష్, బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

## పలువురికి గద్దె క్రాంతి కుమార్ ఆర్థిక సహాయం



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలువురు నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి వైద్య ఖర్చులు నిమిత్తం టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ వారి సొంత నిధుల నుంచి రూ.40 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఉదయం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ ఆర్థిక సహాయాలను 17వ డివిజన్ చెందిన కొమిరి నాగరాజుకు యాక్సిడెంట్ కాగా అతని వైద్య ఖర్చు నిమిత్తం నాగరాజు సతీమణి కొమిరి శోభారాణికి రూ.10 వేలు, గుండు రాముకు రూ.20 వేలు, 13వ డివిజన్ చెందిన ద్రోణవల్లి కోటేశ్వరావుకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ 10 వేలు చొప్పున గద్దె క్రాంతి కుమార్ ఆర్థిక సహాయాలు అందజేశారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, రాయి రంగమ్మ, గద్దె ప్రసాద్, మొకర రమణ, కొప్పుల శ్రీనివాసరావు, నాగూర్, గోపాలదాసు రమణయ్య, ఎం.రాజా, దైదా మహేష్, వెంకటేశ్వరావు, సునాభీ, అమీనా, పండు, డి. వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, యనమద్ది శ్రీను, కొత్తపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బతికుండి చచ్చిపోతున్నాం..కనికరించండి కలెక్టర్ సార్!"



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో 2డి ఎకో పరీక్ష కోసం మహిళలు ఎదుర్కొంటున్న అవమానకర పరిస్థితిని ఊహించడమే కష్టం.కేవలం ఒకే ఒక పురుష టెక్నీషియన్ ఉండటంతో, స్త్రీలు తమ శరీరాన్ని ప్రదర్శించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. "మగ వాళ్ల ముందు జాకెట్ ఓపెన్ చేసి బ్రెస్ట్ చూపించాలంటే బ్రతికుండి చచ్చిపోతున్నట్లుంది" అని బాధతో చెబుతున్న మహిళలు, తాము అనుభవిస్తున్న అవమానాన్ని కళ్లు చెమర్చేలా వివరించారు. జిల్లా కలెక్టర్ని వేడుకుంటున్నాం. మాకు కనీస గౌరవం ఇవ్వండి. మచిలీపట్నం ఆసుపత్రిలో మహిళా టెక్నీషియన్ను 2డి ఎకో పరీక్షల కోసం వెంటనే నియమించండి. అని బాధిత మహిళలు వేడుకుంటున్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు
చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో
పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999